

ఆలన.. మూలన..

మంచానపడిన వారికి అందని 'ఇంటివద్దకు వైద్యం'

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు దక్కని ఉపశమనం
- రోగులకు అందుబాటులో లేని ఆలన వాహనం
- పట్టించుకోని అధికారులు



ఇంటివద్ద వైద్యసేవలందిస్తున్న ఆలన సిబ్బంది (ఫైల్)



నెహ్రూసెంటర్, ఏప్రిల్ 1 : దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికి పరిమితమై ఇబ్బందులు పడుతున్న రోగులు, వయో వృద్ధులను గుర్తించి అక్కున చేర్చుకుని.. ఉచితంగా ఆహారం, మందులు, వైద్య సేవలందించి తోడుగా నిలిచి మనోధైర్యం కల్పించాల్సిన ఆలన కేంద్రం మూలన పడింది. సిబ్బంది, వైద్యాధికారుల నిర్లక్ష్యం మూలంగా రోగులకు సరైన వైద్యం అందించలేకపోతోంది. మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో 2021 నవంబరులో ఈ ఆలన కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 2023 నాటికి 18 మండలాల పరిధిలో క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికి పరిమితమైన రోగులు సుమారు 1200 మంది ఉన్నారని గుర్తించారు. కానీ వారికి అవసరమైన సదుపాయాలు కల్పించలేదు. కేవలం రికార్డులకే పరిమితం చేశారు. ఏనాడూ వారి బాగోగులు పట్టించుకోలేదు. రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారే తప్ప వాస్తవంగా ఆలన కేంద్రం నుంచి వారికి సరైన వైద్యం అందడం లేదు. జిల్లాలో క్యాన్సర్, పక్షవాతం, మధుమేహం, రోడ్డుప్రమాదంలో గాయపడినవారు, చాలా మంది గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. వారికి ఆలన కేంద్రం సేవలపై కనీస అవగాహన లేకపోవడంతో ఇంటివద్దే ఉంటూ ఆస్పత్రికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. వారి వివరాలను సైతం సేకరించడంలో ఆలన సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో రోగులకు వైద్య సేవలపై అవగాహన కల్పించి మనోధైర్యం ఇవ్వాల్సిన ఫీల్డ్ విజిట్ బృందం గ్రామాల్లో కనీసం కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

ఆస్పత్రికి రాలేని వారికి ఇంటివద్ద అందని వైద్యం..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 21 పీహెచ్‌సీలు, 173 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు వివిధ రోగాల బారిన పడిన వారు, మంచానికి పరిమితమై ఆస్పత్రికి రాలేని వారి కోసం ఆలన కేంద్రం సిబ్బంది ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితి అంచనా వేసి ఇంటి వద్దనే వైద్యం అందించాల్సి ఉంది. కానీ ఆ తర్వాత రోగులను ఆలన ప్రత్యేక వాహనంలో ఆస్ప త్రికి తరలించి అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలి. కానీ ఆలన కేంద్రం ద్వారా రోగు లకు ఇంటి వద్ద ప్రాథమిక వైద్యం అందించడంలేదని రోగుల నుంచి బాహటంగానే విమర్శలు విన్పిస్తున్నాయి.

అందుబాటులో లేని వైద్య సేవలు...

దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నా వాటిని ఉపయోగించడడం లేదని, సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. వివిధ గ్రామాల్లో మంచానికి పరిమితమైన రోగులకు సౌకర్యార్థం కోసం ఆలన కేంద్రానికి తరలించే వాహనం చిన్నపాటి మరమ్మతులకు గురై మూలకు పడి తుప్పు పట్టింది. దీంతో రోగులను ఆలన కేంద్రానికి తరలించలేక, సిబ్బంది గ్రామాల్లో ఉన్న రోగులకు వైద్యం అందించలేక ఇబ్బందులు పడుతున్నారు.



ఆలన కేంద్రానికి రోగులను తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనం తుప్పుపట్టిన దృశ్యం

ఆలన వైద్యం గురించి తెలియదు : దరావత్ దస్మి కస్తూరినగరం, బయ్యారం



రెండు సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నా. వైద్యం కోసం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తే మా బంధువుల ద్వార ఆలన కేంద్రం గురించి తెలిసింది. కానీ ఇప్పటి వరకు మాకు ఎవరూ ఆలన ద్వార ఇంటి వద్ద వైద్యం అందిస్తామని చెప్పలేదు. ఇక ఆలన కేంద్రంలో రెండ్రోజులున్నా అక్కడ ఎవరూ సరిగా పట్టించుకోలేదు.

మెరుగైన వైద్యం అందించాలి..



కోండ్ర ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మహబూబాబాద్

క్యాన్సర్, పక్షవాతం, మధుమేహం, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మంచానికి పరిమితమైన వారికి ఆలన కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలి. అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించడానికి తగిన సిబ్బంది, ఫిజియోథెరిపిస్టులను నియమించాలి. మంచానికి పరిమితమైన రోగులను ఆలన కేంద్రానికి తరలించేందుకు వాహనం ఏర్పాటు చేయాలి. రోగులకు ఇళ్లవద్దే నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి.

ఆలన వైద్యంలో లోపాలను సరిచేస్తున్నాం...



నాగేశ్వర్‌రావు, ఆలన ప్రోగ్రాం ఆఫీసర్, మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆలన కేంద్రం ఏర్పాటు చేసి మంచాన పడ్డరోగులు, వయోవృద్ధులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా వైద్యం, ఆహారం, మందులను అందిస్తున్నాం. చిన్న, చిన్న లోపాలను సరిచేస్తున్నాం. త్వరలోనే పూర్తిస్థాయిలో రోగులకు ఇంటివద్దనే నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

- పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అధికారులు

మహబూబాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీటి సరఫరా, ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు అవసరమయిన ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని ప్రతిరోజు తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వార అందుబాటులో ఉన్న వ్యవస్థను వినియోగించుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ బావులను వినియోగించుకోవాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, అదనంగా ట్యాంకర్ల ద్వార నీటి సరఫరాకు సమాయత్తం కావాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. ధాన్యానికి మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2203, కామన్ రకం ధాన్యానికి రూ.2183 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలోతీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, అధికారులు రామారావు, కళావతిబాయి పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పార్లమెంట్ ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లాకలెక్టర్, ఎన్నికలఅధికారి అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సోమవారం పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే లోకసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై మొదటి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైనట్లు చెప్పారు. ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో), అసిస్టెంట్‌ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీవో)లకు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి తగు సూచనలు చేశారు. ఉదయం 350 మంది, మధ్యాహ్నం 350మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీవోలు, ఏపీవోలకు అర్థమయ్యే రీతిలో శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎం. డేవిడ్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

సోమవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 39.0°C	కనిష్ఠం : 22.5°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.35 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.46 గం..

కావ్యకే టికెట్

- వరంగల్ అభ్యర్థిత్వంపై ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం



హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నెలరోజులుగా ఉత్కంఠ రేపిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశానికి తెర పడింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సోమ వారం రాత్రి వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను అధికా రికంగా ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడి యం కావ్య రాజకీయ అరంగ్రేటంతోనే ఊహించనిరీతిలో లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కడియం వర్గంలో ఈ పరిణామం ఆనందం నింపగా, మరోవైపు కాంగ్రెస్ లోని ఆశావహులను తీవ్ర నిరాశకు గురి చేసింది. పార్టీ అధిష్ఠాన నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే అభ్యర్థిత్వం

రెండు రోజుల కిందటే కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తీసుకొని ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్ డిమాండ్‌తోనే శ్రీహరి, కావ్యలు పార్టీలో చేరారు. అయితే ఒక దశలో శ్రీహరి ఎమ్మెల్యే పదవిని వదులుకొని ఎంపీగా రంగంలో దిగుతారనే ప్రచారం జరిగింది. కానీ కూతురు కావ్యను ఎంపీగా బరిలో దింపే డిమాండ్‌తోనే శ్రీహరి కాంగ్రెస్ పెద్దలను ఆశ్రయించారు. మొత్తంగా శ్రీహరి వ్యూహం ఫలించి కావ్యకు టికెట్ దక్కింది.

అనూహ్యంగా టికెట్ సొంతం

కొన్ని రోజుల కిందట బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో కావ్య పోటీకి రంగం సిద్ధమైంది. ఇక ప్రచారమే తరువాయి అనుకుంటున్న సమయంలోనే కడియం కావ్య బీఆర్ఎస్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ఉటంకిస్తూ బీఆర్ఎస్ నుంచి పోటీ

మిగతా 8వ పేజీలో

దొంగతోనే కండువా కప్పించుకుంటివి..

- గతంలో రేవంత్‌రెడ్డిని దొంగ అన్న కడియం..
- నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలు తప్ప.. ఉద్ధరించిందేం లేదు..
- బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ..
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించండి..
- 'వరంగల్' సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 1: 'రేవంత్‌రెడ్డి ఓ మోసకారి, దొంగ అని గతంలో విమర్శలు చేస్తివి.. ఇప్పుడు ఆ దొంగతోనే కాంగ్రెస్ కండువా కప్పించుకుంటివి' అని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం చింతగట్టు క్యాంపు వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన హరీష్‌రావు మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీని వీడాడ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగిందని, పార్టీకి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పాలనే కసి ప్రతీ కార్యకర్తలో వచ్చిందన్నారు. ఆయనకు బీఆర్ఎస్ ఎంతో చేసిందని, నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలే తప్ప ఉద్ధరించిందేం లేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా నిరుద్యోగ భృతి, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతుబంధు, రూ.4వేల పింఛనును సీఎం గాలికి వదిలేశాడని, రేవంత్‌రెడ్డివి తుపాకీరాముడి మాటలని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడంలో భాగంగానే రాష్ట్ర అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించాలనే నిర్ణయం తీసుకున్నారని,ఈ కళాతోరణం వరంగల్ ఆత్మగౌరవ ప్రతీకని, తొలగిస్తే వరంగల్ అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. ఇక బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ.. అని, నల్లధనం డబ్బులు వెలికితీసి ప్రతీ ఒక్కరి అకౌంట్లో రూ.15లక్షలు వేస్తానని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం అవుతున్నా బీజేపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దేవుడి పేరు చెప్పుకుని రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అందరికీ దేవుడంటే భక్తి ఉంటుందంటూ వేదికపైనే హనుమాన్ చాలీసా చదివారు. పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదన్న ఆయన ఉద్యమకారులకు అవకాశాలు కల్పిస్తామని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని శ్రేణులకు భరోసానిచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పైరవీకారులు, బ్రోకర్లు పార్టీని వీడుతున్నారని మండిపడ్డారు. కడియం కూతురుకు ఎంపీ టికెట్ ఇస్తే మూడో స్థానంలో వస్తుందని తాను కేసీఆర్‌కు చెప్పానని, అయినా అందరినీ కాదని ఇస్తే పార్టీ మారడం ఎంతవరకు సమంజసమన్నారు. కడియం ఈ స్థాయిలో ఉండటానికి తానే కారణమని.. నాడు ఎన్టీఆర్‌కు చెప్పి ఎమ్మెల్యే మంత్రి పదవులు ఇప్పించానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం ఉన్నా, ఆయన కూతురు ఉన్నా ఓడించడంలో ముందుంటానని దయాకర్‌రావు పేర్కొన్నారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు కోసం పార్టీ పక్షాన స్పీకర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ మధుసూధనాచారి మాట్లాడుతూ కూతురును అడ్డుపెట్టుకుని కడియం శ్రీహరి రాజకీయం చేస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కడియం శ్రీహరిలాంటి ముసలోళ్లు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, తమతో కావ్యను గెలిపించాలని చెప్పి.. తెల్లారే ప్లేట్ ఫిరాయించాడని ఆరోపించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కడియం శ్రీహరి పార్టీ మారేందుకు ప్రయత్నిస్తున్నాడని, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం చస్తే.. ఆయన ముగ్గురు బిడ్డలు మాత్రమే పాడె మోయాల్సి వస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నీతి గురించి చెప్పే కడియం.. దేవునూరులో భూమి ఎలా కొన్నాడో.. ఇల్లు ఎలా కట్టాడో అందరికీ తెలుసన్నారు. నాడు ఎన్టీఆర్, చంద్రబాబుకు ఈరోజు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కడియం జీవితమంతా నీచ చరిత్రేనని, దళితుడని అని చెప్పుకొనే ఆయన.. ఏరోజు దళితులను చేరదీయలేదన్నారు. కడియం ఇబ్బందులు భరించలేకనే రాజయ్య, అరూరి రమేశ్, పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌ను వీడారన్నారు. ఇన్ని పార్టీలు మారిన కడియం.. కేఏపాల్ ప్రజాశాంతి పార్టీకి కూడా పోతాడని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ ఛైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్రజ్యోతి, మాజీ కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్, రజనీకుమార్, చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, హరీష్‌రావు మాట్లాడే క్రమంలో చిట్యాలకు చెందిన కంజర్ల రమణకుమార్ అనే కార్యకర్త ఒక్కసారిగా వేదికపైకి వచ్చి కాళ్లకు మొక్కి సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల సమయంలో రేవంతర్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను స్క్రీన్‌పై చూపిస్తూ ప్రసంగించినప్పుడు కార్యకర్తలనుంచి మంచి స్పందన వచ్చింది.

అప్పు చేసి పప్పు కూడు

- భారంగా మధ్యాహ్న భోజనం
- రెండు నెలలుగా బిల్లులు పెండింగ్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- విద్యార్థులకు తప్పని తిప్పలు



బయ్యారం, ఏప్రిల్ 1 : బడి ఈడు పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతోంది. పిల్లలకు బడిపై ఆసక్తి పెంచడం.. ఆకలి సమస్యను అధిగమించడం కోసం సాగుతున్న ఈ కార్యక్రమానికి నిధుల కొరత, సౌకర్యాల లేమి ఆటంకాలు సృష్టిస్తోంది. పేద విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ పథకం రోజురోజుకు భారంగా మారుతోంది. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వర్కర్లు అప్పు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వండిపె డుతున్నారు. ఇక పిల్లలకు వారంలో మూడు సార్లు ఇచ్చే గుడ్డు విషయంలో వర్కర్లు మరింత ఇబ్బంది పడుతున్నారు.. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి బిల్లులను విడుదల చేయాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

765 బడులు.. 45 వేల మంది పిల్లలు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 898 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 102 ఉన్నత, 120 ప్రాథమికోన్నత, 676 ప్రాథమిక పాఠశాలలున్నాయి. అయితే జీరో ఎన్‌రోల్ మెంట్ (పిల్లలు లేక మూతపడినవి) పాఠశాలలు 141 పోను జిల్లా వ్యాప్తంగా బడి నడిచిన దినాల్లో 757 పాఠశాల నందు మధ్యాహ్న భోజనం అమలవుతోంది. వీటితో పాటు 8 మోడల్ స్కూల్స్‌లలో కూడా ప్రభుత్వం మధ్యహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. అన్ని పాఠశాలల్లో కలిపి సుమారు 45 వేల మంది పిల్లలు పాఠశాలల్లో భోజనం చేస్తున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది.

సన్న బియ్యం సరఫరా చేస్తూనే..

మధ్యహ్న భోజన నిమిత్తం ప్రభుత్వం పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేయడంతో పాటు వంటా వార్పు కోసం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు రూ. 5.45 చొప్పున, 6,7,8 విద్యార్థులకు రూ. 8.17 చొప్పున, 9,10 చదివే విద్యార్థులకు రూ. 10. 67 చొప్పున వర్కర్లుకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. దీంతో పాటు వారానికి మూడు సార్లు పెట్టె గుడ్డు నిమిత్తం గుడ్డు ఒక్కంటికి రూ. 5 చొప్పున చెల్లిస్తుంది. గుడ్డు రోజు అదనపు భారం పడుతుందని, వంటా వార్పు కోసం అప్పు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

వర్కర్ల గౌరవ వేతనమూ అంతే..!

పాఠశాల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెల గౌరవ వేతనం అందిస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ప్రతీనెల వెయ్యి చొప్పున, రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల చొప్పున వర్కర్లకు గౌరవ వేతనం ఇస్తుంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2వేలు గౌరవ వేతనం మాత్రం గత ఏడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉంది. మొత్తం మీద 5 నెలలుగా గౌరవ వేతనం, రెండు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో దినదినగండంగా మారి ందని పలువురు వర్కర్లు వాపోతున్నారు. పభుత్వం స్పందించి పెండింగ్‌లోని బిల్లులు, గౌరవ వేతనం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అప్పు చేయాల్సి వస్తోంది : బాగం కోటమ్మ



బిల్లులు సరిగ్గా రాకపోవడంతో మధ్యాహ్న భోజన నిమిత్తం ప్రతీ నెలా అప్పు చేయాల్సి వస్తోంది. వంట చెరుకు కూడా నిండు కోవడంతో పొయ్యి వెలిగించడం కూడా ఇబ్బందిగానే మారింది. గౌరవ వేతనం కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలి


- జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్



ఏఎస్సై ఇంద్రాచారిని సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 : ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గూడూరు ఏఎస్సైగా విధులు నిర్వహి స్తున్న చొల్లేటి ఇంద్రాచారి పదవీవిరమణ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మెమెంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత 35 ఏళ్లుగా జిల్లా పోలీస్‌శాఖలో నిజాయితీగా, బాధ్యతతో విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ పొందిన ఏఎస్సై ఇంద్రాచారికి అభినందనలు తెలిపారు. తన శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేయడం గొప్పవరమని చెప్పారు. నిబద్ధత, బాధ్యతతో విధులు నిర్వర్తించే వారికి ఎల్లప్పుడు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. క్రమశిక్షణతో పోలీస్‌శాఖకు అందించిన సేవలను, ఆయన పనితీరును ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బాబురావు, ఎస్సై నగేష్ పాల్గొన్నారు.







ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీష్‌రావు భేటీ

రాంనగర్, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై మాజీ మంత్రి హరీష్‌రావు వరంగల్ నేతలతో సమాలోచనలు చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న హరీష్‌రావు హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని నేతలతో భేటీ అయ్యారు. బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని నిర్ణయించి జిల్లా నేతలతో చర్చించారు. వరంగల్ అభ్యర్థిత్వం కోసం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతోపాటు పార్టీని వీడిన డాక్టర్ రాజయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాజయ్యతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకునేది ఖరారు కాలేదు.

కాగా, పెద్ది స్వప్నవైపు పలువురు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంచి పేరు ఉండటంతో స్వప్నకు టికెట్ ఇస్తే కలిసివచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. స్వప్న ఎస్సీ సామాజికవర్గం మద్దతుతో పాటు భర్త పెద్ది సామాజికవర్గమైన ఓసీల మద్దతు లభించే అవకాశం ఉంటుందనే విషయాన్ని నేతలు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డి సైతం తన సతీమణికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, వీరేందర్, నిరంజన్, సిరిమల్ల సదానందం, విక్టర్‌బాబు, బండి రజనీకుమార్, చింతల యాదగిరి సైతం తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వీరు మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులతో ప్రత్యేక భేటీ అయిన హరీష్‌రావు.. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించేలా చూస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘంగా చర్చించిన హరీష్‌రావు.. అధిష్ఠానంతో మాట్లాడి ఒకటిరెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేద్దామని నేతలకు తెలిపినట్లు సమాచారం.

నలుగురు భూ కబ్జాదారుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. సోమవారం వారిని అరెస్టు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పారుపాటి శ్రీదేవితోపాటు మరో ఆరుగురు వ్యక్తులు 15 యేళ్ల కిందట కోమటిపల్లి శివారులో స్థలం కొనుగోలుచేసి పర్మిషన్‌లు తీసుకుని షెడ్లు వేసుకుని కబ్జాలో ఉంటున్నారు. కిందటేడు శివప్రసాద్ అనే వ్యక్తి ఈ స్థలం కబ్జా చేసేందుకు యత్నించగా కేసు పెట్టారు. శివప్రసాద్ నుంచి స్థలం తీసుకున్నట్లు పేపర్లు సృష్టించిన హైదరాబాద్‌కు చెందిన ఘట్టమనేని సతీష్‌చంద్రతోపాటు వరంగల్ నగరానికి చెందిన కర్నే వేణు, గూగుల్ నరేష్, కారం ప్రభాకర్‌లు కబ్జా చేసే ప్రయత్నం చేశారు. 15 యేళ్ల కిందట కొనుగోలు చేసిన వారిని బెదిరింపులకు గురిచేసి వారు నిర్మించుకున్న షెడ్లను నేలమట్టం చేసి స్థలం చదును చేశారు. ఈ స్థలం వేరే వ్యక్తులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నకిలీపత్రాలు సృష్టించి కబ్జాకు యత్నించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా, ఈ నలుగురు భూకబ్జాదారులుగా గుర్తించి రౌడీషీట్లు ఓపెన్ చేశారు.







నేడు మందబుద్ధిపై అవగాహన సదస్సు

వడ్డెపల్లి, ఏప్రిల్ 1: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రపంచ మందబుద్ధి (ఆటిజం)పై అవగాహన సదస్సును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆమె కోరారు.

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి : ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రజాశాంతి పార్టీ నుంచి బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు ఆశీర్వదించి విజయం కట్టబెట్టాలని ప్రజాశాంతి పార్టీ లోక్‌సభ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి బాబుమోహన్ కోరారు. సోమవారం హనుమకొండ ములుగురోడ్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాబు మోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆశీస్సులతో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ నుంచి వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటానన్నారు. ప్రజాశాంతి పార్టీ తరఫున కేఏ పాల్ విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నాడని, అక్కడికి తనను పిలిపించి శాలువా కప్పి ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా, వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. వరంగల్ బిడ్డగా, 25 యేళ్ల రాజకీయ అనుభవం కలిగిన తనను వరంగల్ ప్రజలు లోక్‌సభకు ఆశీర్వదించి పంపితే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి చేస్తానన్నారు.

లోక్‌సభ అభ్యర్థిగా విజయం కట్టబెడితే ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లను కేఏ పాల్ సొంత నిధులతో అందిస్తామని బాబుమోహన్ హామీ ఇచ్చారు. ప్రపంచ దేశాల అధ్యక్షుల మన్ననలు పొందిన వ్యక్తిగా, సేవాగుణం కలిగిన వ్యక్తిగా, రాష్ట్రానికి పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తీసుకవచ్చిన గొప్ప మేధావి అయిన కేఏ పాల్ పట్ల కొందరు వక్తులు తప్పుడు కూతలు కూయడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లాగా అబద్ధాలు చెప్పడంగానీ, మోసాలకు పాల్పడటం తెలియని వ్యక్తి కేఏ పాల్ అని కొనియాడారు. కేసీఆర్‌తో తాను టచ్‌లో ఉన్నానని కొందరు పుట్టిస్తున్న పుకార్లు అవాస్తవమని, తాను ఎవరికో కొమ్ముకాస్తున్నానని వస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. తనను కొనే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదన్నారు. చౌకబారు రాజకీయలు చేయకుండా నిజాయితీతో కూడిన రాజకీయలు చేయాలని హితవు పలికారు.

25 యేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ కాంట్రాక్టులు, అవినీతి, అక్రమాలకు, కబ్జాలు పాల్పడలేదన్నారు. మాజీ సీఎం ఎన్‌టీఆర్ ఆశీస్సులతో రాజకీయ అరంగ్రేటం చేశానన్నారు. వరంగల్ గడ్డపై పుట్టి ఖమ్మంలో పెరిగి సినిమా ఇండస్ట్రీలో అంచెలంచెలుగా ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చానన్నారు. గతంలో ముక్కు, మొఖం తెలియని జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అక్కడి ప్రజలకు విశేష సేవలు, అభివృద్ధి పనుల చేసిన తాను.. జన్మనిచ్చిన జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. లోక్‌సభ బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు పెద్ద మనస్సుతో దీవించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సింగారపు సుజాత , పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తరాల శంకర్, ఆర్ల శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బాబుమోహన్

వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్ద పీట

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1: వరంగల్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట వేశాడని బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ లోక్‌సభ సీటు గెలుపు కోసం ఏవిధంగా సిద్ధం కావాలనే అంశంపై పశ్చిమ నియోజకవర్గంలోని బూత్‌స్థాయి నాయకులతో సోమవారం హంటర్‌రోడ్డులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ మాట్లాడుతూ.. 2014 కంటే ముందు తెలంగాణలో 2,511 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉంటే.. మోదీ 9 ఏళ్ల పాలనలోనే 2,500 కిలో మీటర్ల జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. మరో 2,269 కిలోమీటర్ల జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. స్మార్ట్‌సిటీ ద్వారా వరంగల్ నగరంలో మెరుగైన సదుపాయాల కోసం రూ.2,500 కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హెరిటేజ్ సిటీ కింద రూ.32కోట్లను విడుదల చేశారన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీమ్‌లో భాగంగా వరంగల్‌కు 7,096 ఇళ్లను మంజూరు చేశారన్నారు. అమృత్ పథకం కింద 273.58కోట్ల నిధులను ఇచ్చారన్నారు. ఆదర్శ రైల్వేస్టేషన్స్‌లో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్ ఆధునీకరించడం, కాజీపేట నుంచి విజయవాడకు మూడో లైన్ పనులను చకచకా జరుగుతున్నాయన్నారు. రూ.521కోట్లతో నిర్మించబోతున్న రైల్వే తయారీ యూనిట్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభించబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరోసిన్‌తో దీపాలు వెలిగించుకొని జీవితాలు వెళ్లదీసేదని, అలాంటిది మోదీ ప్రభుత్వంలో ప్రధానమంత్రి సౌభాగ్య యోజన స్కీమ్‌లో భాగంగా తెలంగాణలో ఐదు లక్షల 15వేల విద్యుత్ కనెక్షన్‌లను ఇచ్చారని అరూరి అన్నారు. కాకతీయులు నిర్మించిన వారసత్వ సంపదకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి మరువలేనిదన్నారు. అన్నీ విధాలుగా వరంగల్‌ను అక్కున చేర్చుకున్న మోదీ నాయకత్వాన్ని వరంగల్ బలపర్చాలని కోరారు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 1984లో వరంగల్ వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం అవుతాయన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఆర్.కిషన్, సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, డి.దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ఆర్.కోమల, బి.లక్ష్మీ, సీహెచ్. స్వాతి, డి.అభినవ్ భాస్కర్, జి.వసంత, జిల్లా నాయకుడు కొలను సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పశ్చిమ నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

పెరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వార్షిక ఆదాయం

రాంనగర్, ఏప్రిల్ 1: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల ద్వారా కిందటేడు కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. కిందటేడు (2022-23) ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 103646 డాక్యుమెంట్స్ కాగా ఫీజు రూపేనా రూ.404కోట్ల 42లక్షల 93వేల ఆదాయం రాగా, ఈవార్షిక సంవత్సరం (2023-24) 106016 డాక్యుమెంట్లు కాగా ఫీజు రూపేనా రూ.415కోట్ల 63 లక్షల 61వేలు ఆదాయం సమకూరింది. గత సంవత్సరం కంటే రూ.11కోట్ల 20లక్షల 68వేలు ఆదనంగా ఆదాయం వచ్చింది. ఈ యేడు 13 కార్యాలయాల్లో హనుమకొండ వడ్డెపల్లి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అత్యధికంగా 29557 డాక్యుమెంట్‌లు నమోదు కాగా రూ.201కోట్ల 22లక్షల 18వేల ఆదాయం రావడం విశేషం. ఈ యేడు వచ్చిన ఆదాయంలో సగం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావడం గమనార్హం.

ఒడిస్సా కూలీ మృతి

బయ్యారం, ఏప్రిల్ 1:జీవనోపాధి నిమిత్తం ఒడిస్సా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బయ్యారం మండలం కాచనపల్లి ఇటుక బట్టీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం నవరంగ్ జిల్లా కందిగూడ గ్రామానికి చెందిన బోయి సంపత్ (56) నెల కిందట ఇటుక బట్టీలో దినసరి కూలీగా పనిచేసేందుకు కొందరు కూలీలతో బయ్యారం మండలం వచ్చాడు. కాచనపల్లి సమీప ఓ ఇటుక బట్టీ నందు పనిలో చేరిన సంపత్.. తోటి కూలీలతో కలిసి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సంపత్ బట్టీలో ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారుజామున తోటి కూలీలు చూసే సరికి సంపత్ మృతి చెంది ఉన్నాడు. సంపత్ ఎలా మృతి చెందాడనదే ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. కానీ బట్టీ యజమాని మాత్రం సంపత్‌ది సహజ మరణమేనని పేర్కొంటున్నాడు. సంపత్ కొంత మద్యం సేవించి నిద్రించినట్లు బట్టీ యజమాని వెల్లడించారు. అటవీ ప్రాతంలో గల బట్టీలో నిద్రించడంతో ఏదైన విష పురుగు కుట్టి చనిపోయాడా.. లేక మద్యం సేవించిన మత్తులో నిద్రించి దాహార్తికి లోనై మృతి చెంది ఉంటాడా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడిపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

కొత్తగూడ, ఏప్రిల్ 1 : కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో యువకుడిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కొత్తగూడ మండలం చిట్యాలగడ్డకు చెందిన వంకాయల కార్తీక్ అనే యువకుడిని ఈ నెల 19న పొగుళ్లపల్లిలో తొమ్మిది మంది కలిసి విచక్షణ రహితంగా దాడి చేశారు. కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిదిమందిపై అపహరణ, గాయపరిచిన, కు లం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సోమవారం పొగుళ్లపల్లికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కేసు నమోదైన గద్ద అశోక్, ఎటుకూరి హరీష్, చవ్వ శివ, వట్టం నాగరాజు, గుగ్గిళ్ల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.


కొండా దంపతులను వారి నివాసంలో కలిసిన కడియం శ్రీహరి, కావ్య

బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరా..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మతోన్మాద బీజేపీ ఆగడాలను అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. లౌకికవాద పరిరక్షణ కోసం పార్టీలో చేరానన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నాగరాజును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం కూతురు కావ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి పాలన ప్రజాదరణ పొందుతోందన్నారు. స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. మిగతా వివరాలు త్వరలో వివరంగా తెలియచేస్తానని మీడియా ప్రశ్నలకు బదులిచ్చారు. కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన తదుపరి ఎమ్మెల్యేలను కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్లు చెప్పారు. ప్రత్యక్ష ఎన్నికల్లో మాట్లాడే అవకాశం తనకు ఇంకా రాలేదని, వచ్చాక చెబుతానంటూ మీడియా ప్రశ్నలకు కావ్య సమాధానంగా చెప్పారు. కాగా, అంతకుముందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య కలిశారు. సోమవారం ఇద్దరు ఎమ్మెల్యేలను వారి వారి నివాసాల్లో వేరు వేరుగా కలిశారు.

కొండా దంపతులను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

వరంగల్ సిటీ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని గెలిపించుకునేందుకు వ్యూహాలపై చర్చించుకున్నారు. తొలిసారి కడియం శ్రీహరి, కావ్య తమ నివాసానికి వచ్చినందున కొండా దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం తొలిసారిగా వేములవాడ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తన మనవడి పేరుమీద కోడె మొక్కును చెల్లించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామిని ప్రార్థించినట్లు మంత్రి చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో పూజలుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంత్రి కొండా సురేఖకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా..

● దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన ● మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. డ్రామాకు సంబంధించిన స్క్రిప్ట్ అంతా మాజీ మంత్రి దయాకర్ రావు సిద్ధం చేసి కేసీఆర్‌తో మాట్లాడించారని ఆరోపించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో నాగరాజు కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కుంభకర్ణుడు నిద్రలేచినట్లు కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి రైతుల వద్దకు వచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు ఇప్పుడు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌పాలన ఇంకా నాలుగు నెలలు కూడా పూర్తి కాక ముందే కేసీఆర్ అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. వర్షాకాలం రాక ముందే సీఎం రేవంత్ రెడ్డి పాలనలో కరువు వచ్చిందంటూ వ్యాఖ్యలు చేయడం కేసీఆర్‌కు మతిభ్రమించినట్లు అర్థమవుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెబుతున్న కేసీఆర్.. వాస్తవాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తరిమికొడతామని హెచ్చరించారు. రైతుల బతుకులను ఛిద్రం చేసిందే కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు దిక్కుతోచని స్థితికి గురయ్యారన్నారు. ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని మండిపడ్డారు. రైతుబంధును బూచిగా చూపి రైతులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను హరించారని ఆరోపించారు. రైతుబంధు పేరుతో కేసీఆర్ దోపిడీ చేశారన్నారు. ఈ క్రమంలో అర్హత గల రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి భూస్వాములకు రైతుబంధు వర్తించకుండా పరిమితులు విధించి అమలు చేయాలనే ప్రణాళికతో ఉన్నారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్‌పాలనలో విద్యుత్, నీటిసరఫరా నిరంతరాయంగా జరుగుతుందన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలన స్కామ్‌లమయంగా సాగిందని నాగరాజు ఆరోపించారు. కాళేశ్వరం భారీ కుంభకోణమన్నారు. దేశచరిత్రలోనే ఇంతటి కుంభకోణం మరొకటి లేదన్నారు. కేవలం దోచుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ స్కెచ్ వేశారన్నారు. నిపుణులు డిజైన్ విషయంలో ఎంతగావారించినా 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్ వినలేదని విమర్శించారు. మిషన్‌కాకతీయ పేరిట చెరువుల పూడికతీత చేపట్టిన కేసీఆర్.. వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు ఇలా.. ప్రతీదానిలో కేసీఆర్ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కూతురు కవిత లిక్కర్ స్కాం, కేసీఆర్ కాళేశ్వరం కుంభకోణం, కుమారుడు మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ఇలా కేసీఆర్ కుటుంబం అక్రమాలు తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశాయన్నారు. అక్రమాలు బయటపడుతుండడంతో కేసీఆర్ మతిభ్రమించి కరువు యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నాగరాజు పేర్కొన్నారు. గడీల తలుపులు బద్దలు కొట్టి ప్రజాపాలనకు ద్వారాలు తెరిచారన్నారు. కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యల చేరికపై మీడియా ప్రశ్నలకు సమాధానమిస్తూ.. అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శేఖర్ రావు, కిసాన్ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావుతోపాటు మహేందర్, వీసం సురేందర్‌రెడ్డి, తిరుపతి, బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంపల్లిలో భూ వివాదంలో ఘర్షణ

● భార్యాభర్తలు, కొడుకుపై హత్యాయత్నం ● గొడ్డలి, కర్రలతో దాడి.. తీవ్రగాయాలు

సీరోలు, ఏప్రిల్ 1: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో సోమవారం రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో దంపతులు, వారి కుమారిడిపై ప్రత్యర్థులు కర్రలు, గొడ్డల్లతో దాడిచేయడంతో వారు తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. బాధితుల కథనం ప్రకారం...కాంపల్లి గ్రామంలో రేపాల కృష్ణ, రేపాల వెంకటనారాయణ కుటుంబాల మధ్య గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. గ్రామ సమీపంలోని మహబూబాబాద్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన ఉన్న రేపాల కృష్ణ వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న ఉపేందర్, పెద్ద సత్యంలు కృష్ణ భూమిలో రాళ్లు పాతేందుకు యత్నిస్తుండగా తమ భూమిలో రాళ్లు ఎందుకు పాతుతున్నారని వారిని అడుగగా ఘర్షణ చోటుచేసుకుంది. ఇది నీ భూమి కాదు మా భూమిలో రాళ్ల పాతుకుంటే నీవెవరు అడ్డుకోవడానికి అంటూ కృష్ణతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కర్రలు, గడ్డపారలతో కృష్ణ కుమారుడు అశోక్‌పై దాడి చేస్తుం డగా అడ్డువచ్చిన తల్లి బిక్షమమ్మపై కూడా దాడి చేశారు. . తల్లిని కాపాడేందుకు ప్రయత్నించిన అశోక్‌పై దాడిచేస్తుండగా పక్కనే వరి పొలం కోయిస్తున్న తండ్రి రేపాల కృష్ణ అక్కడికి చేరుకోగానే ముగ్గురిపై ప్రత్యర్థులు దాడి చేశారు. గొడ్డలితో తలపై నరకడంతో తీవ్రగాయమై రక్తస్రావంతో కుప్పకూలిపోవడంతో చుట్టుపక్కల వారు వెంటనే. 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆ ముగ్గురిని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కృష్ణ పరిస్థితి విషమంగా ఉందని భార్య బిక్షమమ్మ కుమారుడు అశోక్, తెలిపారు. ఈ విషయంపై సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్‌ను వివరణ కోరగా బాధతుడి కూతురు యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘర్షణలో గాయపడిన రేపాల కృష్ణ, రేపాల అశోక్

తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐగా ప్రవీణ్



ప్రవీణ్

తొర్రూరు, ఏప్రిల్ 1 : తొర్రూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐగా ఆర్.ప్రవీణ్ సోమవారం బాధ్యతలు చేప ట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ భాస్కర్‌రావు దీర్ఘ కాలిక సెలవుపై వెళ్లడంతో జనగామ జిల్లా కేంద్రంలోని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహి స్తున్న ఆర్.ప్రవీణ్‌కు తొర్రూరు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు అప్పగిస్తూ ఎక్సైజ్ శాఖా కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రవళి గత నెల 25న ఎక్సైజ్ కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి అక్రమ మద్యాన్ని సీజ్ చేయగా ఆ మద్యం నిల్వలను ఎస్సై రవళి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరే కం గా ఆటోల్లో తరిలించి వైన్ షాపులకు విక్రయించారనే ఆరోపణల నేపథ్యంలో ఎస్సై రవళిని వరంగల్‌లోని డీసీ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలిపారు. రవళి వెళ్ళ డంతో స్టేషన్ పరిధిలోని విధుల నిర్వహణ కోసం డిప్యూటేషన్‌పై మరో ఇద్దరు ఎస్సైలు ఎస్.అనిల్, కె.తిరుపతి తొర్రూరుకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీలు దొందూ.. దొందే

మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



రాములుతండాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు, ఏప్రిల్ 1 :బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు దొందు.. దొందేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. గూడూరు మండలంలోని రాములుతండ, గూడూరు గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే మురళీనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకే గూటీ పక్షులని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ అభివృద్ధి పేరుతో జపం చేస్తూ అభివృద్ధిని మరిచాయని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సురక్ష పాలన అందించేందుకు సీఎం రేవం త్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, జిల్లా, మండల నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, బొల్లికొండ మధు, వాంకుడోతు కొమ్మాలు, రసూల్, జగన్, సుందర్, ప్రశాంత్, చంటిస్వామి, సురేందర్, కారం లక్ష్మయ్య, భద్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాహూల్‌ను ప్రధానిని చేయాలి

మహబూబాబాద్ టౌన్ : త్వరలో జరగబోయే పార్లమెంట్ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయపథాన నడిపించి రాహూల్‌గాంధీని దేశ ప్రధానిని చేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించారు. ప్రధాన కూడలిలోని ప్రతిషాపు, ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పోతురాజు, తాళ్లపల్లి జగన్, చలమల నారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుటి సురేష్‌నాయుడు, నాళ్ల లక్ష్మినర్సింహారావు, నాళ్ల వీరన్న, బెల్లంకొండ శ్రీనివాస్, చిదిరాల జ్ఞానేశ్వర్,బోనగిరి గిరిధర్‌గుప్తా, ప్రసాద్, సూరయ్య సురేష్ పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈ నెల 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ అమరావతి సోమవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాలకు అర్హత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ telanganams.cgg.gov.in. లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కేసముద్రంలో పోలీసుల కవాతు

కేసముద్రం, ఏప్రిల్ 1 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేసముద్రంలో సోమవారం సాయంత్రం ఎస్‌ఐ వంశీధర్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌తో కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ-2 రాజయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామన్ స్కూల్ విధానం అమలు చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానాన్ని అమలుచేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కులాలు, మతాల పేరుతో పాఠశాలలను స్థాపిస్తే లౌకికవాదం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో నాయ కులు కృష్ణమూర్తి, దేవదాసు, వెంగల్‌రెడ్డి, రమేష్, శంకర్‌నారాయణ, వెంకట స్వామి, సురేందర్, రఘు, శర్మ, హరిశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 : షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, గుండ్ల రాకేష్, ఎమ్డీ హన్మ, మహేష్, వినయ్, అశోక్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

డోర్నకల్, ఏప్రిల్ 1 : మహబూబాబాద్ నుంచి కోదాడ వరకు వెళ్లే జాతీయ రహదారి 365/ఎ రహదారి విస్తరణలో భాగంగా ఇంటి స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కోల్పోతున్న బాధితులు తమ డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకు అందించాలని డోర్నకల్ ఆర్‌ఐ రామ ముల్కలపల్లి వాసులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ముల్కలపల్లిలో స్థానికులతో ఆర్‌ఐ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణకు జాతీయ రహదారి సంస్థ మార్కింగ్ చేసిన స్థలాలకు చెందిన వారు ఏమైన అభ్యంతరాలు ఉంటే డోర్నకల్ తహసీల్దార్‌కు అందించాలని తెలిపారు.

పేదల పక్షపాతి మంగపతిరావు

గార్ల మే 1: నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు పేదల పక్షపాతిగా ఐతపు మంగపతిరావు నిలిచారని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీపీఎం ఐతపు మంగపతిరావు స్మారక భవనంలో సోమవారం జరిగిన మంగపతిరావు 23వ వర్ధంతి సభను నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇమ్మడి గోవిందు, వీరభ ద్రం, జడశ్రీను, అలవాల రామకృష్ణ, సత్యవతి, రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

హైస్కూల్‌కు సౌండ్ సిస్టం అందజేత

కేసముద్రం, ఏప్రిల్ 1 : మండలంలోని తాళ్లపూసపల్లి జడ్పీహైస్కూల్‌కు సోమవారం 2023-24 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.18,500 విలువైన సౌండ్ సిస్టంను బహూకరించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో విద్యార్థులంతా కలిసి ఈ సహాయాన్ని అందించడం అభినంద నీయమని హెచ్‌ఎం కోట కనకయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్‌కుమార్, శ్రీనివాస్, గోపికృష్ణ, కుమారస్వామి, జావిద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

నెల్లికుదురు, ఏప్రిల్ 1 : ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలరాజు తెలిపారు. మండలంలోని రావిరాల వస్రాం తండ, మదనతుర్తి, పార్వతమ్మగూడెం, గ్రామాలలో ఉపాధి హామీపనులను సోమవారం ఆయన పరిశీలించారు. తాగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి లేకుండా బోర్లుమంజూరైనట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కొనసాగుతున్నాయని కూలీలు పనులలో పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన సదస్సు

నెల్లికుదురు, ఏప్రిల్ 1 :తహసీల్దార్ కార్యాలయంలో హోం ఓటింగ్ పై బీఎల్‌వోలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు, సుపర్ వైజర్‌లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె రాజు మాట్లాడుతూ దివ్యాంగులు, 80వేళ్ల వయస్సు పైబడినవారు, అనారోగ్యంతో బాధ పడుతున్నా వారు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి హోం ఓటింగ్ వేయాడానికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలు, సుపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వికలాంగుల కాలనీకి చెందిన మునిగ యాకేష్-కల్పన దంపతుల పెద్దకుమారుడు కార్తీక్ కన్పించడం లేదని టౌన్ ఎస్సై శివ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ఆర్తిగార్డెన్ నుంచి తన స్నేహితుడు వచ్చాడని, అతన్ని తీసుకువస్తానని తల్లి కల్పనకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఇంటర్‌లో రెండు పేపర్లు మాత్రమే రాసి మిగతా పరీక్షలు ఎందుకు రాయలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని చెప్పారు. నాటి నుంచి స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదని చెప్పారు. తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి స్థలాన్ని రక్షించాలి

గూడూరు, ఏప్రిల్ 1 : గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం స్థలాన్ని పరిరక్షించాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మండల అధ్యక్షులు బానోత్ చందులాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ శ్వేతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లాలు, చంటి, బాలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

తొర్రూరు, ఏప్రిల్ 1 : అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. తొర్రూరులోని 5వ వార్డు పరిధిలో నివాసం ఉంటున్న దారావత్ దేవేందర్ (52) గత కొంతకాలంగా ఆనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మరిపెడ రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన బింగి దేవయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, గంధశిరి అంబరీష, మెంచు అశోక్‌గౌడ్, గుండెపుడి తాజా మాజీ సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉప్పలయ్య మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డోర్నకల్ ఎలక్ట్రానిక్ మీడియా విభాగం ఎన్నిక

మరిపెడ, ఏప్రిల్ 1 : డోర్నకల్ ఎలక్ట్రానిక్ మీడియా విభాగం ఎన్నిక మరిపెడ మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిం జరిగింది అధ్యక్షుడిగా చెలమల్ల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా గండి విష్ణు, ఉపాధ్యక్షులుగా భయ్యా నాగరాజు, మంద ప్రకాశ్, సహాయ కార్యదర్శులుగా సాయిరెడ్డి, దొంతు సృజన్, కోశాధికారిగా సుధాకర్, ఈసి మెంబర్లను ఎన్నుకున్నారు.

కావ్యకే టికెట్

(5వ పేజీ తరువాయి)

చేయలేనంటూ స్పష్టం చేయడంతో బీఆర్ఎస్‌కు పెను దెబ్బ తగిలింది. ఆ వెంటనే కడియం శ్రీహరి కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పడం.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఊహించని రాజకీయ పరిణామాలు తెరపైకి వచ్చాయి. వరంగల్ లోక్‌సభ టికెట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతరులు కూడా సీరియస్‌గా ప్రయత్నించారు. చివరకు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన వారికి నిరాశే ఎదురైంది.

భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

● మహర్షి విద్యాలయ కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సుధా అర్జున్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యు కేషన్, ఏప్రిల్ 1 : భవిష్య త్తులో ఉన్నత విద్య నభ్యసించి అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని మహర్షి విద్యాలయ కరస్పాం డెంట్ మల్గిరెడ్డి సుధా అర్జున్ రెడ్డి అన్నారు. మహబూబా బాద్‌లోని మహర్షి విద్యాల యలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు పైచదువులు, భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాఅర్జున్‌రెడ్డి మాట్లాడుతూ...మార్చి నెలలో రాసిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.తొలుత పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ సూర్యకుమారి, తక్కెళ్లపల్లి సంధ్యారాణిలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అనాథలైన పిల్లల చెంతకు అధికారులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

కేసముద్రం, ఏప్రిల్ 1 : కేసముద్రం విలేజిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో సొంత ఇల్లు లేక టెంటు కిందనే జీవనం సాగిస్తున్న ముగ్గురు పిల్లలను సోమవారం మహబూబాబాద్ ఐసీడీఎస్ అధికారులు సందర్శించారు. 'ఇల్లు లేక టెంటు దిక్కు..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు సదరు టెంటు వద్దకు వచ్చి వారి వృత్తి, ఆర్థిక పరిస్థితులను సేకరించారు. ప్రభుత్వ పరంగా వీరికి సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఐసీడీఎస్ ఏసీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. బాలల సంరక్షణాధికారి నరేష్, చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేష్, సూపర్‌వైజర్ సరోజ, నిర్మల పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావొద్దు : సీపీఐ

కురవి, ఏప్రిల్ 1 : దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే మతతత్వ రాజ్యాంగాన్ని అమల్లోకి తెస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కురవిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్పోరేట్ వర్గాలకు దేశాన్ని తాకట్టు పెట్టిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. దేశంలో బీజేపీ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, మండల కార్యదర్శి కర్ణం రాజన్న పాల్గొన్నారు.

దేశానికి మోదీ శ్రీరామ రక్ష : సీతారాంనాయక్

మరిపెడలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

మరిపెడ, ఏప్రిల్ 1 : దేశానికి మోదీ నాయకత్వం శ్రీరామరక్ష అని మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోటలో కాషాయ జండ ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రేపటి మన తెలంగాణ భవిష్యత్ మార్చబోయేది బీజేపీ గెలుపేనని అన్నారు. పార్లమెంట్ ప్రభారి వెంకట్ నారాయణరెడ్డి, సంగీత, లక్ష్మణ్, వెంకన్న వివిధ మండలాల అధ్యక్షులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

యువకుడిపై యువతి బంధువుల దాడి

ద్విచక్రవాహనం కాల్చివేత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 1: సినీ ఫక్కీలో యువతి బంధువులు యువకుడిపై దాడి చేసి అతని ద్విచక్రవాహనాన్ని దహనం చేసిన సంఘటన సోమవారం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో జరిగింది. ఎస్‌ఐ పోటు గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన ఒక యువతీ, యువకుడు సోమవారం పర్ణశాలకు ద్విచక్రవాహనంపై వచ్చారు. పర్ణశాల పార్కింగ్ ప్రాంతంలో వారిద్దరు ఉండగా, అక్కడికి కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు యువకుడిపై కర్రలతో దాడిచేశారు. యువకుడిని కొంతదూరం కర్రలు పట్టుకొని తరిమారు. పారిపోయిన యువకుడి ద్విచక్రవాహనం నుంచి పెట్రోలు తీసి దాన్ని తగలబెట్టారు. అక్కడే ఉన్న యువతిని కారు ఎక్కించుకొని వెళ్లిపోయారు. పర్ణశాల గ్రామస్థులు కారును ఆపి వివరాలు అడగ్గా, వారి చెల్లిని ఆచూకి కోసం పర్ణశాల వచ్చి ఆమెను తమ వెంట తీసుకెళ్తన్నామని చెప్పారు. వారిది కేసముద్రం మండలానికి చెందిన వారిగా తెలిపారు. పర్ణశాల గ్రామస్థుడు హరికృష్ణ ఫిర్యాదు చేశాడు.


చీర భిక్షపతి సేవలు ప్రశంసనీయం



భిక్షపతికి జ్ఞాపికను అందజేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి తదితరులు

గూడూరు, ఏప్రిల్ 1 : విద్యారంగంలో చీర భిక్షపతి సేవలు అమోఘనీయమని పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గూడూరు బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం చీర భిక్షపతి ఉద్యోగ విరమణ అభినందన సన్మానసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు.. అనంతరం హెచ్‌ఎం చీర భిక్షపతి-విజయ దంపతులను ఘనం గా సన్మానించి మెమోంటో అందించారు. పీఆర్టీ యూ-టీఎస్ జిల్లా అధ్యక్షులు సంకా బద్రినా రాయణ, ప్రధాన కార్యద ర్శి సతీష్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సదాశివ, రాష్ట్ర నాయకులు బీరవెల్లి కమలాకర్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుగులోతు హాల్యానాయక్, జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం, ప్రధాన కార్యదర్శి తుమ్మ వెంకటేశ్వర్లు, గంగునాయక్, పులుసం శ్రీనివాస్, లక్ష్మయ్య, మహబూబ్‌అలీ, వెంకన్న, బత్తుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు



తాగునీటి ఎద్దడిపై చర్చిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 1: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులు, ఫ్లోర్‌లీడర్లతో సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. తాగునీటిఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఫ్లోర్ లీడర్లు బి. అజయ్ సారధిరెడ్డి, సూర్నపు సోమయ్య, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, దండెబోం ఐన బుజ్జి వెంకన్న, పోతురాజు రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

చేర్యాల, ఏప్రిల్ 1 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దే వాలయ నిత్యాన్నదాన పథకానికి మహబూబాబాద్‌కు చెందిన దాసరి శేఖర్ రూ.50,116 నగదు విరాళంగా అందించాడు. ఈసందర్భంగా సోమవారం ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి చేతులమీదుగా విరాళాన్ని అందజేశారు. అనంతరం లక్ష్మారెడ్డి వారికి స్వామివారి ప్ర సాదం, రశీదు అందించారు. ఆయనవెంట పునరుద్ధరణ కమిటీ సభ్యుడు అల్లం శ్రీనివాస్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మరిపెడ రూరల్, ఏప్రిల్ 1 : నల్లబెల్లం విక్రయించినా, గుడుంబా తయారు చేసినా వారిపై కఠిన చర్యలుంటాయని మరిపెడ అదనపు ఎస్సై సంతోష్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బావోజి గూడెంలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 1500 లీటర్ల బెల్లం పానకం, 20లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి పలువురుపై కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ క్రాంతి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలి

చిన్నగూడూరు, ఏప్రిల్ 1 : వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీఓ కిన్నెర యాకయ్య, మిషన్ భగీరథ డీఈ అనూష, గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఉన్నారు.

మరిపెడ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

మరిపెడ, ఏప్రిల్ 1 : మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలోని పలు రికార్డులు, ల్యాబ్, ఫార్మసిని పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న పేషంట్‌లతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించే విధంగా రూపొందించిన అవగాహన కర పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి, సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, లక్ష్మి, బాలాజీ, సుధాకర్, అనిత ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పెద్దవంగర, ఏప్రిల్ 1 : బాల్య వివాహాలతో పిల్లలకు ఎన్నో అనర్థాలు కలుగుతాయని, బాల్య వివాహాలను ఆరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సీడబ్ల్యూసీ నాగవాణి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు నలమాల అరుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడవో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు, చట్టాలకు విరుద్ధంగా పని చేసినా వెంటనే 100 డయల్, 1098 సమాచారం అందించాలని తెలిపారు. ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్ కవితరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి భూమి పూజ

గార్ల మే 1 : మండలంలోని పోన్నెకంటి గండి గ్రామంలో సీతారాముల వారి గుడి నిర్మాణానికి గ్రామస్తులు సోమవారం గ్రామస్తులు భూమి పూజనువైభవంగా నిర్వహించారు. బీజేపీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడు రేపాకుల వెంకట్రావ్ నేతృత్వంలో గ్రామంలో గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలయం నిర్మాణానికి గ్రామస్తులు ఆర్థికంగా చేయుత నివ్వాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, వీరస్వామి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలి

గార్ల, మే 1: గార్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో గార్ల మండల కేంద్రంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాని రైతులు సద్వినియోగం చేసుకోవాలి గార్ల పీఎసీఎస్ సీఈవో సింగు వెంటేశ్వర్లు కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు పండించిన వరి ధాన్యాలను ప్రభుత్వం నిబంధల ప్రకారం నాణ్యామైన ధాన్యమును ఎగ్రేడ్ రకము రూ 2203, కామం రకము రూ. 2183 అమ్ముకోవాలని రైతులను కోరారు. హెచ్ రవి, భీముడు, శ్రీరాములు,శేఖర్ పాల్గొన్నారు,

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1: షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-1ఉచిత శిక్షన జిల్లాలోని నిరుద్యోగులైన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలల సోమవారం ఉచిత గ్రూప్-1 కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో విత్తనాల సుధాకర్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కేసముద్రం : కేసముద్రం అంగడి ప్రాంతంలో పీడీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం ప్రారంభించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గంట సంజీవరెడ్డి, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు విజయ, వెంకటేశ్, పొలెపల్లి వెంకట్‌రెడ్డి, తరాల వీరేష్, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఒంటరి యువతి వివాహం



యువతికి కుట్టుమిషన్ అందజేస్తున్న సమ్మయ్యగౌడ్ తదితరులు

కేసముద్రం, ఏప్రిల్ 1 : చిన్నతనంలోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరి అయిన యువతి వివాహాన్ని విరాళాలతో జరిపించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కేసముద్రం స్టేషన్ బడితండాకు చెందిన బానోత్ రేష్మకు ఏడాది వయసులోనే తండ్రి రాము, ఐదేళ్ల ప్రాయంలో తల్లి బూలి అనారోగ్యంతో చెందారు. నానమ్మ కూడా ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో రేష్మ ఒంటరిగా మారింది. ఈ క్రమంలో యువతి పరిస్థితి చూసి ఎలాంటి వరకట్నం ఆశించకుండా ఆదే తండాకు చెందిన ధరావత్ దేవా వివాహం చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. అయితే వివాహం జరిపించేందుకు డబ్బులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న తండావాసులు, గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు, వివిధ పార్టీల నాయకులు డబ్బులు, వస్తువుల రూపంలో విరాళాలు అందజేయడంతో సోమవారం తెల్లవారుజామున రేష్మ, దేవ వివాహం జరిగింది. యువతి పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రత్యేకంగా హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి తనవంతుగా కొంత నగదును సహాయంగా ఇచ్చారు. సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో రేష్మకు వివాహం సందర్భంగా రూ.12,500 కుట్టుమిషన్‌ను బహూకరించారు.